# "మానవులంతా" సోదరులే (నా?)

ఈ కథకీ, మహాత్మాగాంధీ గారు వ్రాసిన ఇదే పేరుగల పుస్తకానికీ ఏమీ సంబంధం లేదు. బాపూజీ సూత్రాన్ని సిద్ధాంతీకరించడానికి గాని, పూర్వపక్షం చెయ్యడానికి గాని, వ్రాసిన కథా కాదు.

ఇది ఇద్దరు అన్నదమ్ముల కథ. వారి పేర్లు గోవిందం, నారాయణ. ఇద్దరూ భూస్వాములు, సోషలిస్టు, గాంధేయులు. పైన ఉదహరించిన "మానవులంతా సోదరులే" అన్న గాంధీజీ పుస్తకం వారిద్దరివద్దా చెరొక ప్రతీ ఉంది. ఒకే వేదికమీద నిలబడి, పై పుస్తకం యొక్క ప్రాశస్త్యాన్ని గురించి ఇద్దరూ అద్భుతమైన ఉపన్యాసాలు ఇచ్చారు మా ఊళ్ళో. ఇద్దరూ కలిసి గాంధేయ సోషలిస్టు పార్టీ స్థాపించారు. మా ఊళ్ళో; వారిద్దరూ సమిష్టిగా ఉన్న రోజుల్లో.

ఇప్పుడిద్దరూ ఆస్తులు పంచుకుని విడిపోయారు.

అందువల్ల గాంధేయ సోషలిస్టు పార్టీ రెండుగా చీలిపోయింది మా ఊళ్ళో.

అసలు పేచి ఊళ్ళో ఇళ్ళు, స్థలాలూ ఆ సోదరులు పంచుకున్న సందర్భంలో వచ్చింది.

వారి తండ్రి కీ॥ శే॥ వియ్యన్న గారు చాలా దూరదృష్టి గలవాడు. ఆయన ప్లీడరు గుమస్తాగా పనిచేస్తూ, దిక్కులేని వితంతువుల ఆస్తుల

అన్యాక్రాంతం కాకుండా కాపాడి, సుమారు రెండువందల యకరాల వరకూ ఆర్జించారు. వారి ఆర్జనలో ఒక చక్కని పద్ధతి ఉంది. తనకు ఇద్దరు కొడుకులు గనుక, సేకరించిన ఆస్తి పంపకం విషయంలో ముందు ముందు పేచీలు రాకుండా ఆయనే జాగ్రత్త పడ్డారు. ఏ ఊళ్ళో ఏ ఆస్తి ఆయన సేకరించినా విలువ-విస్తీర్ణ విషయంలో సరి సమానంగా తెగేటట్టుగా కొన్నారు. ఊళ్ళో స్థలం సరిగ్గా రెండెకరాలు. అందులో చెరొక ఎకరంలోనూ చెరొక ఇల్లూ కట్టారు. ఒకే రకమైన ఇళ్ళు. కొబ్బరి చెట్టూ రెండుభాగాల్లోనూ సరి సమానంగా పాతించి పెంచారు.

చదువు విషయంలో ఇద్దరికీ సరి సమానంగా డబ్బు కేటాయించారు వియ్యన్న గారు. అయితే పెద్దకొడుకు గోవిందం వట్టి బి. ఏ. మాత్రం పాసై, మిగిలిన డబ్బుదాచుకున్నాడు. నారాయణ ఆసొమ్ములో చాల భాగం ఖర్చుపెట్టి ఎమ్. బి. బి. యస్ పాసై ఊళ్లోనే ప్రాక్టీసు ప్రారంభించాడు.

ఇద్దరు కొడుకుల్నూ కడుపుకో ఉండగా వియ్యన్నగారు పోయారు. పోయేముందు ఆయన వ్రాసిన విల్లు వకీలు సుబ్బారాయుడుగారు, కర్మకాండ పూర్తయిన తర్వాత కొడుకులిద్దరికీ చదివి వినిపించారు. (వియ్యన్నగారు సుబ్బారాయుడు గారి వద్దనే గుమస్తాగా పనిచేశారు)

ఆవిల్లు అన్నదమ్ముల మధ్య క్రమక్రమంగా పెరిగిన వైషమ్యాలకి బీజం నాటింది. వియ్యన్నగారి విల్లులో ప్రధానాంశాలు—

ఆస్తి అంతా వియ్యన్నగారి స్వార్జితం. అంచేత దాని పంపకం విషయంలో ఆయనకి సంపూర్ణాధికారం ఉంది. కొడుకులిద్దరూ ఆయనకి సమమే. అంచేత తన అనంతరం ఆస్తి వారిద్దరూ సమంగా పంచుకోవచ్చు అయితే ఇద్దరిలో ఎవరైనా నిస్సంతుగా చనిపోతే, వారిభాగం కూడ రెండో సోదరుడికి చెందుతుంది. మరొక అంశం-ఇద్దరికీ మగబిడ్డలు కలిగితే, ఎవరి,

ఆస్తిని వారి వారి బిడ్డలు సమంగా పంచుకుంటారు. అయితే, ఇందులో ఒకరికి మగసంతానం కలిగి రెండోవారికి ఆడబిడ్డ కలిగితే. ఆడబిడ్డల తండ్రికి తన భాగాన్ని జీవితాంతం మాత్రమే అనుభవించవచ్చు. ఒక్కొక్క ఆడబిడ్డకు పదియకరాల ఆస్తిని మించకుండా కట్నకానుకల క్రింద ఇవ్వవచ్చు. అంతే గాని ఆస్తిని అమ్మే హక్కు అతనికి ఉండదు. అతని అనంతరం బ్రతికి ఉంటే అతని సోదరునికి గాని, లేకపోతే అతని మగ బిడ్డలకుగాని, అతని భాగం కూడా దఖలు పడుతుంది.

ఈ విల్లు సోదరులిద్దరిలో మొదట అంత అలజడి కల్గించ లేదు. భార్యలిద్దరూ గర్భవతులు ...... మొదట కాకపోయినా, తరువాత మగబిడ్డలు కలగవచ్చు. అందువల్ల విల్లుచదివిన ప్లీడరుగారితో సహా తాముకూడా తండ్రి దూరదృష్టిని ఎంతో మెచ్చుకున్నారు.

అన్నదమ్ములిద్దరూ కలిపి, అంతర్జాతీయ సోషలిస్టు సమాఖ్యకు ఒక అద్భుతమైన ప్రసంగ వ్యాసం వ్రాసి పంపారు. వారిరిద్దరిలో ఎవరూకూడా ఆ సమావేశానికి వెళ్ళలేకపోయారు. ఎందుకంటే, వారి భార్యలకు పురుడు వచ్చే రోజులు? కాని అవ్యాసం చాలా విప్లవాత్మకమైన కొత్త పంథాలో ఉందని ప్రతినిధులందరూ అంగీకరించారు. ఆ వ్యాసంలో ప్రధానమైన అంశాలు:

కమ్యూనిజం హింసతో, రక్తపాతంతో, ఇంత వరకూ సాధించిన ముందు సాధించ బోయే ప్రయోజనాలన్నీ, గాంధీయ సోషలిజమ్, అహింసాయుతమైన శాంతి మార్గంలో సాధిస్తుంది. రష్యా, చైనా మొదలైన దేశాల్లో కమ్యూనిస్టు విప్లవం సాధించినదేమిటి? విప్లవ కారుల కూటం ఒకటి ఆయా దేశాల్లోని ఆస్తులనూ, పరిశ్రమలనూ, ప్రజోపయోగంకోసం చేజిక్కించుకొని, వాటి మీద సర్వం సహాధికారాన్ని చలాయిస్తున్నాయి. అంటే గాంధీయ

పరిభాషలో. ఆవిప్లవ కూటం ఆదేశంలోని ఆస్తిపాస్తులన్నింటికీ ధర్మ కర్తలన్నమాట. మొదట కమ్యూనిస్టు తత్వవేత్తలు ఊహించినట్టు ఈ కూటంలోని ప్రముఖులు పారిశ్రామిక కూలీలుకారు సమాజంలో పలుకుబడీ బలం గల ప్రముఖులు. ఇదే ప్రయోజనాన్ని గాంధీమార్గాన్ని సాధించడం సులభమైన శాంతియుతమైన పద్ధతి, ప్రతిపల్లెలోని ప్రముఖ భూస్వాములు ఆపల్లెలోని ఆస్తికంతకీ ధర్మకర్తలు గా వ్యవహరిస్తే. ప్రతి పారిశ్రామి కూడా. తన పరిశ్రమకి ధర్మకర్తగా నడుచు కుంటే. గాంధీయ సోషలిజం అమలులోకి వస్తుంది. కమ్యూనిస్టు విప్లవకారులు సిద్ధాంతీకరించినట్టు, పీడిత ప్రజానీకంలో విప్లవాత్మకమైన ఉత్తేజం వర్ధిల్లి. రక్తపాతం. సంఘర్షణ. వర్ధిల్లనక్కరలేదు కొద్దిమంది భూస్వాములు. మిల్లుయజమానులలో హృదయ పరివర్తనవస్తేచాలు. సోషలిస్టు ప్రయోజనాలన్నీ ప్రజలకు సమకూడుతాయి. అంతేకాదు కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వాధికారం క్రమ గా సన్నగిల్లి, 'స్టేట్' క్రమంగా నశించాలి. అయితే విప్లవం ద్వారా సాధించిన కమ్యూనిజంలో 'స్టేట్' అంతకంతకీ బలమైన సర్వాధికారాలనూ చేజిక్కించుకుని. ఏమహారాజులకీ ఎన్నడూ లేని నిరంకుశ ప్రతిపత్తి కలిగి ఉంటున్నది. కమ్యూనిస్టు మూల ప్రయోజనమైన "స్టేట్" అంతరించే స్థితి, ప్రస్తుత కమ్యూనిస్టు విప్లవ పద్ధతి ద్వారా ఒక్కనాటికీ రాదు. అది గాంధీయ సోషలిస్టు పద్ధతి ద్వారానే సాధ్యమౌతుంది. ఆస్తి అధికారం వికేంద్రీకృత మౌతుంది. ప్రతిపల్లె ప్రతి పరిశ్రమ అధికారాన్ని పంచుకుంటాయి. వీటిని నిర్వహించే ధర్మకర్తలు వీటిని సవ్యంగా నిర్వహించే అధికారాన్ని మాత్రమే కలిగి ఉంటారు, దేశం సుభిక్షమౌతుంది ప్రజలు సుఖపడతారు.

తమ సిద్ధాంతాన్ని కార్యరూపంలో పెట్టడానికి, గోవిందం, నారాయణ, ఊళ్ళోని పెద్ద భూస్వాముల్ని పదిమందిని సమావేశ పరిచారు. అందులో

అడ్వకేటు సుబ్బారాయుడుగారు కూడా ఒక ప్రముఖ భూస్వామి అంతా కలిపి ఒక సమిష్టి వ్యవసాయ కేంద్రాన్ని స్థాపించారు. పది పదిహేను వేల యకరాలు ఆధునిక పద్ధతుల ననుసరించి. సాగుచెయ్యడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఖర్చులు పోగా మిగిలిన ఆదాయన్ని, విస్తీర్ణాన్ని బట్టి. ఆయా భూస్వాములు పంచుకునే ఏర్పాటు. పాత పాలి కాపులకు. ఇది వరకు వారికి ముడుతున్న పరిమితికి కొంచెం పైగానే ఫలసాయం ఇవ్వడానికి నిర్ణయించుకున్నారు. ఎందుకంటే. పాలికాపుల్లో అసంతృప్తి పెరిగితే. వారు నక్సలైట్లుగామారి, పండిన పంటని కోసుకునిపోయే అవకాశం ఉంది. ఈ సమిష్టి కేంద్రం తరపున ప్రభుత్వం వ్యవసాయ శాఖ దగ్గర నుంచి పది ట్రాక్టర్లు ఉచితంగా సంపాదించారు. ఇది దేశానికి ఉపయోగించే ప్రయోజనం గనుక ఎరువులు తగినన్ని తక్కువ ధరలకు దొరికే ఏర్పాటు చేసుకున్నారు. పంటలు పెరిగాయి. భూస్వాములకీ. పాలికాపులకీ కూడా ఫలసాయం పెరిగింది. ఈ కేంద్రం ఇంక సమర్థంగా విజయవంతంగా పనిచేయ్యడం చూసి. మిగిలిన భూస్వాములు కూడా ఇందులో చేరుతామని ఎగబడ్డారు. గోవిందం. నారాయణ ఊరికి ధర్మకర్తలయ్యారు. అయితే గోవిందం మాత్రమే తన కాలాన్నంతటినీ ప్రజోపయోగానికి వినియోగిస్తున్నాడు. నారాయణ డాక్టరుగనుక తన వృత్తిలో నిమగ్నుడై ఖాళీగా ఉన్నపుడు కేంద్రం వ్యవహారాలు పర్యవేక్షణ చేస్తున్నాడు. ఫలసాయంలో సగానికి పైగా ఖర్చుక్రింద ఈ ధర్మకర్తలు చూపించడం కొందరు భూస్వాములలో కొంచెం అసంతృప్తి కలిగించినా. తమఆదాయం వెనుకటి కన్నా పెరిగిన కారణం చేత వారిని బహిరంగంగా ఎదిరించ లేదు. అయితే ఈ సోదరులను తొలగించి తాము ధర్మకర్తలయితే బాగుండునన్న భావం కొందరిలో కల్గింది. కాని భూస్వాములలో ఎక్కువమందికి ఈ సోదరుల సామర్థ్యం మీద నమ్మకం ఉండబట్టి, వీరిని తొలగించడానికి ప్రత్యక్షంగా ఎవరూ ప్రయత్నించ లేదు.

గోవిందం, నారాయణల ఇల్లు, రెండెకరాల స్థలంలో ఊరి మధ్య ఉన్నాయని చెప్పాను. అయితే అవి ఒక సందులో ఒక చివర ఉన్నాయి. సంద దక్షిణం వైపున వారి కాంపౌండు గోడతో ఆఖరవుతుంది. తూర్పు వైపున ఉన్న ఇంట్లో అన్నదమ్ముల ఉమ్మడి కాపురం. దక్షిణంవైపు ఇంట్లో నారాయణ ఆసుపత్రి. తూర్పువైపు ఎకరం నేలలో గాంధీ విగ్రహాన్ని ఒకదాన్ని ప్రతిష్ఠించించి. దానివెనకాల దక్షిణపు ఎకరంలో ఒకచిన్ని కుటీరం నిర్మించారు సోదరులు–అది గాంధీయ పోషలిష్టు కార్యాలయం.

మొదటి కానుపులో, గోవిందం భార్య ఒక ఆడపిల్లనీ, నారాయణ భార్య మగబిడ్డనీ కన్నతరువాత కూడా, అన్నదమ్ముల మధ్య అభిప్రాయ భేదాలు అంతగా రాలేదు. గోవిందం మనసులో ఒక చిన్న అనుమాన బీజం మాత్రం మొలకెత్తింది. తమ్ముడు తన భార్యకి ఆమందూ ఈమందూ ఇచ్చి ఆడపిల్ల పుట్టేటట్టు చేసాడాఅని. వైద్యులకది సాధ్యం కాదని నలుగురూ అంటారు చదువుకున్న గోవిందానికి అది తెలియక పోలేదు. అయితే తండ్రి వ్రాసిన విల్లు దృష్ట్యా, తనకి ఆడ బిడ్డ కలగడం కొంత అన్యాయమే జరిగిందని అతనిబాధ అయినా ఇవన్నీ తనపెళ్ళాం దగ్గర కూడా అత నెప్పుడూ ఎత్తలేదు. ఉమ్మడి సంసారం నడుస్తూనే ఉంది, ఎప్పటిలాగే మరో నాలుగు సంవత్సరాల తర్వాత, నారాయణకి రెండో మగ పిల్లవాడు కలగడం, తనకి తీరని అవమానంగా భావించాడు గోవిందం. దేవుడిమీదా, మరదలుమీదా, తన భార్యమీదా, వీలు దొరికినప్పుడల్లా విరుచుకు పడ్డం మొదలెట్టాడు. కారణం పైకి ఎవరూ వ్యక్తం చెయ్యకపోయినా, లోలోపల అందరికీ తెలిసిన మూలంగా. అతన్ని ఏమీ అనలేరు. నారాయణ తనలో తను నవ్వుకున్నాడు. ... భార్య జాలి పడింది. గోవిందం భార్య బాధ పడింది.

గోరుచుట్టుమీద రోకటి పోటన్నట్టు, మరొక దారుణమైన దెబ్బతగిలింది. మొదటికానుపు తర్వాత ఎనిమిదేళ్ళకి అతని భార్యకి నెలతప్పిందని అతను ఎగిరి గంతువేశాడు. దేవుడు తనకీసారి తప్పకుండా న్యాయం చేస్తాడని – ఆశపడ్డాడు. కాని, ఆమెకు ఆరో నెల్లో గర్భస్రావమైంది. లేడిడాక్టరు ఆమెకు మళ్ళీ కడుపువస్తే ప్రమాదమని నిర్ణయించి, బిడ్డలు కలక్కుండా ఆపరేషన్ చేసింది. ఇప్పుడతని కింక దైవంమీద నమ్మకం పూర్తిగా పోయింది చాల తెలివైనవాడు దూరదృష్టి కలవాడు అనుకొన్న తండ్రి వట్టి దొంగగా దుర్మార్గుడు గా అతనికి కనపడ్డం మొదలు పెట్టాడు. అసలా విల్లు నారాయణే తండ్రి చేత, తన్ను అన్యాయం చేసే ఉద్దేశంతో వ్రాయించాడని కూడా అనుకోడం మొదలు పెట్టాడు. అప్పటికి నారాయణకీ బిడ్డలు లేరన్న సంగతి గోవిందం పూర్తిగా మరిచి పోయాడు. ఆ తరువాత గాంధీయ సోషలిష్టు పార్టీ కార్య కలాపాలలోనూ వ్యవసాయ కేంద్ర నిర్వహణలోనూ అన్నదమ్ముల మధ్య చిన్న చిన్న అభిప్రాయ భేదాలు రావడం మొదలు పెట్టాయి. ఈ అభిప్రాయ భేదాలు మొదట కార్యరూపం దాల్చింది ఆస్తి పంపకం విషయంలో వకీలు సుబ్బారాయుడు గారు ఇద్దరికీ తండ్రి వంటి వాడు గనక. మధ్యస్థం చేసారు ఇద్దరూ కలిసి ఉంటే ఇద్దరికీ మంచిదనీ ఊరికి మంచిదనీ ఆయన ఎంతగానో బోధించాడు. కాని తనవాదాన్ని బలపరుస్తాడను కొన్న నారాయణ కూడా పంపకానికి సుముఖుడుగా తిరగడం ఆయనకు ఆశ్చర్యం కలిగించింది. (అతను ఏకాంతంగా సుబ్బారాయుడు గార్ని కలుసుకొని తండ్రి విల్లు ప్రకారం గోవిందం ఆస్తి అమ్మడానికి వీలులేదు గనుక గోవిందం ఇష్ట ప్రకారం జరిగి పోతే అతని మనస్తాపం కొంత తగ్గి పోతుందనీ. ఆయనకు నచ్చ చెప్పాడు) తక్కిన ఆస్తుల పంపకంలో పేచీ ఏమీరాలేదు. ఏ భాగం కావాలో ఎన్నుకునే విషయంలో గోవిందానికి అవకాశం వదిలేశాడు నారాయణ. ఇళ్ళు పంపకం విషయంలో మాత్రం ఉత్తర వేపు ఇల్లు తనకు కావా

అని పట్టు పట్టాడు గోవిందం కూడా అదే కావాలన్నాడు. అయితే నారాయణ ఆసుపత్రి తో ఆ ఇంట్లో ఉన్న మూలంగా. అతను దానికి ఒప్పుకోలేదు. గోవిందం వాదం ఏమంటే. ఆ ఉత్తరపు భాగంలో గాంధీయ సోషలిస్టు సమితి కార్యాలయం కోసం కట్టిన షెడ్డు ఉంది. అందుచేత దాని విలువ కొంచెం ఎక్కువ. ఆఖరికి నారాయణ మందహాసంతో. సుబ్బారాయుడి గారి సూచన ప్రకారం. ఆషెడ్డు స్థలం గోవిందానికి అప్పగించడానికి ఒప్పుకున్నాడు.

అయితే గోవిందం కసి తీరలేదు. తనభాగం తన అనంతరం తమ్ముడి బిడ్డలు పంచుకోవడం అతనికి మహా అన్యాయంగా కనిపించింది. అందుచేత ఆ అన్యాయాన్ని సరిదిద్దే ఉద్దేశంతో అతను సుబ్బారాయుడి గారి వద్దకు వెళ్ళి. తండ్రి. విల్లు రద్దు చేయించడానికి దావా వెయ్యమన్నాడు. అతని వాదం ఏమంటే. తండ్రి. విల్లు వ్రాసిన అనంతరం. హిందూ సివిల్ ప్రొసిజర్ కోడ్ సవరణ జరిగింది. కొత్త వారసత్వపు పద్ధతిని బట్టి. తన పెళ్ళి కాని కుమార్తెకు తన భాగం ఆస్తి చెందాలి. న్యాయంగా. సుబ్బారాయుడి గారికి ఈ అన్న తమ్ముల మధ్య తగాదాలు పెరగడం ఇష్టంలేదు. ఎందుకంటే. సమిష్టి వ్యవసాయ కేంద్రంలో ఆయనకు మూడువందల యకరాల వరకూ ఉంది. మునిసిపాలిటీ ప్రస్తుతం సోషలిస్టు సమితి అధ్వ ర్యంలో ఉంది. నారాయణ చైర్మన్. ఈ తగాదా వల్ల ఊరు చీలిపోతుంది అందరికి నష్టం. అయితే గోవిందం హృదయమంతా అక్కసుతో నిండిపోయి ఉందనీ. అతను మంచిచెడ్డల విషయం తర్కిస్తే అర్థంచేసుకునే స్థితిలో లేడని ఆయన గ్రహించాడు. అందుచేత ఈ వారసత్వం విషయంలో హైదరాబాద్ లోని అడ్వకేట్ జనరల్ ని సలహా అడిగి మరీ దావావేస్తే మంచిదనీ. అంచేత గోవిందాన్ని కొంచెం ఓపిక పట్టమనీ చెప్పాడు. ఈ విషయాలు పరోక్షంగా నారాయణతో చర్చించాడు. నారాయణ అంతావిని ఊరుకున్నాడు. అన్నగారు

ఇంత దారుణానికి పాల్పడతాడని అతను అనుకోలేదు.

నారాయణ సమిష్టి కేంద్రలో వాటాలున్న నలుగురయిదుగురు భూస్వాముల్ని రహస్యంగా తన ఇంటికి పిలిచి. తనఅన్నగాడు ఆ కేంద్రం తాలూకు సొమ్ము నాలుగైదు లక్షల వరకు తినేశాడనీ వ్యవసాయ కేంద్రం నిర్దుష్టంగా నడవాలన్న సదుద్దేశంతో ఈ సంగతి తను బయట పెడుతున్నాననీ తను నీతికి న్యాయానికీ కట్టుబడి ఉండే వ్యక్తి గనక. సొంత అన్నగారైనా అవినీతికి పాల్పడితే తను సహించలేక ఈ సంగతి బయట పెడుతున్నానీ. వారికి వివరాలతో సహా బోధించాడు.

ఈ సంగతి గోవిందానికి తెలిసింది

అతను గాంధీయ సోషలిష్టు సమితిని అత్యవసరంగా సమావేశపరచి. క్రితం మునిసిపల్ ఎన్నికలలో పార్టీ ప్రచారం కోసం నారాయణ వసూలు చేసిన ఆరు లక్షల పదిహేను వేలకూ. ఇంత వరకూ లెక్క చెప్పక పోవడం శోచనీయమని. తను నీతికి న్యాయానికి కట్టు బడే నిసలైన సోషలిష్టు గనుక తన తమ్ముడన్న పక్షపాతం లేకుండా తనే ఈ విషయం అడుగుతున్నాననీ, పదిమందిలోనూ అడిగాడు. సమిష్టి వ్యవసాయ కేంద్రం ఖర్చుల లెక్కలు నాలుగేళ్ళగా ఆడిట్ కాలేదనీ. దాని తాలూకు జమా ఖర్చులు ముందు తేలాలనీ అన్నాడు నారాయణ. ఇది సోషలిష్టు సమితి సమావేశం. వ్యవసాయ కేంద్రం జమా ఖర్చుల విషయం అప్రస్తుతం అన్నాడు గోవిందం. ఎన్నికలలో పాల్గొన్న వ్యక్తుల కోసం ఖర్చు పెట్టింది ఆ మొత్తం. అది సమితి జమా ఖర్చులలోకి రాదన్నాడు నారాయణ. దానీ మీద తీవ్రమైన వాదోపవాదాలు చెలరేగాయి. సుబ్బారాయుడుగారు మధ్యలో సామరస్యానికి ఎంతో కృషి చేశాడు.

"అందరికీ ఒక్కమనవి. ఇప్పుడు ఈ ఊళ్ళో సోషలిష్టు సమితి ప్రాబల్యం ఎక్కువగా ఉండడానికి. మునిసిపాలిటీ మొదలుకొని అన్ని పౌర

కార్యక్రమాల వరకు మన చెయ్యే పైన ఉండడానికి కారణం. ఇంతవరకూ మనలో ఉన్న సఖ్యత కారణం. మనలోమనం వైషమ్యాలు పెంచుకొని చీలిపోతే, మనమూ ఊరునాశనమై పోతారు. కమ్యూనిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, అధికారాన్ని చే జిక్కించు కోడానికి సిద్ధంగా ఉన్నారు. మనలో ఎన్ని తగాదాలున్నా సర్దుకుపోవాలి" అని ఎన్నో విధాల హెచ్చరించారు.

"అయ్యా! అయితే ప్రజా ధనాన్ని ఎన్నికల కోసం వసూలు చేసి, లెక్కా జమా లేకుండా కాజేస్తే నోరు మూసుకు ఊరుకోమంటారా! మనం ఊరుకున్నా ప్రజలు ఊరు కుంటారా?" అన్నాడు గోవిందం.

"సమిష్టి వ్యవసాయ కేంద్రం జమా ఖర్చులు తేల్చక పోతే మాత్రం ప్రజలు ఊరుకుంటారా?" అన్నాడు నారాయణ.

"నాయనా! మీరిద్దరూ భూజాన్ని వేసుకున్నది ప్రజాకార్యం. ఇటు వంటి బాధ్యతలు నెత్తిన వేసుకున్న వారిలో చాలా పెద్దలే, లెక్కల విషయంలో జాగ్రత్త పడలేదు. మీరిద్దరూ తగాదా పడ్డట్టే, ఇందిరాగాంధీ పాటిల్, కాంగ్రెసు నిధి విషయంలో వాదోపవాదాలు పెంచుకున్నారు. అయితే మీరు వారూ కూడా గమనించని విషయం ఒకటుంది. ప్రజాధనాన్ని వసూలు చేసి దానికి 'నువ్వు లెక్క చెప్పలేదు' అని ఒకరు ఆరోపించినప్పుడు, నువ్వూ అపనే చేశావు'అని ఎత్తి పొడవడం సమాధానం కాదు ఇందిరాగాంధీ పాటిల్ ఇద్దరూ ఆ సొమ్ముకి లెక్కలు చెప్పి, తాము ఒక్కపైస కూడా దుర్వినియోగం చెయ్యలేదని ప్రజలకు నిరూపించారు. మీ ఇద్దరికీ ఎన్నికల నిధి, కేంద్ర నిధి తినేసేటంత గతి ఏమీపట్టలేదని. మీరిద్దరూ ఉన్నవారనీ అందరికీ తెలుసు. అయితే నీతిగా నడుచుకుంటే మాత్రం చాలదు. నడుచుకున్నట్టు స్పష్టంగా ప్రజలకి నమ్మకం కలగాలి. అంచేత ఆ లెక్కలు త్వరలో ఆడిట్ చేయిస్తే, ఈ గోడవలేమీ ఉండవు" అన్నారు సుబ్బారాయుడుగారు.

అయినా గాంధీయ సోషలిస్టు సమితిలో చీలికలు తప్పలేదు.

ఇద్దరూ లెక్కలు తయారు చేయించి ఆడిట్ చేయించినా ఒకరి లెక్కలు ఒకరు ఒప్పుకోలేదు. ఎవరికివారే తాము నిజమైన గాంధీయ సోషలిస్టులని ప్రచారం ప్రారంభించారు. అన్ని పేటలలోనూ జంట మీటింగులు ప్రారంభమయాయి. పరస్పర విమర్శ దూషణంగా పరిణమించింది.

గోవిందం, ఒక పాల వర్తకుడికి ప్రభుత్వం చేత అప్పు ఇప్పించి, పది గేదెల్ని కొనిపించి, వాటిని తమ సందులో కట్టుకోడానికి అనుమతించాడు. అందువల్ల ఉత్తరం వేపున ఉన్న నారాయణ ఉన్న ఇంట్లోకి కారూ పేషెంట్లూ రావడానికి మహా ఇబ్బందిగా ఉంది. నారాయణ పోలీసు కేసు పెట్టాడు. గోవిందం తండ్రి విల్లు చెల్లదని, సుబ్బారాయుడిగారికి తెలియకుండా మరొక అడ్వకేట్ చేత దావా వేయించాలని ప్రభుత్వానికి అర్జీ పెట్టాడు. గోవిందం నారాయణ మీద మునిసిపాలిటీలో విశ్వాస రాహిత్య తీర్మానం పెట్టించాడు. నారాయణ గోవిందం తరపు మనుష్యులనందర్నీ గాంధీయ సోషలిస్టు సమితిలోంచి తొలగించేశాడు. గోవిందం నారాయణ పక్షం వాళ్ళని తొలగించేశాడు. సుబ్బారాయుడుగారు చాలా బాధ పడ్డారు.

సమిష్టి వ్యవసాయ కేంద్రం పంటల్ని కొందరు "నక్సలీయులు" ఒక రాత్రికి రాత్రి కోసుకు పోయారు. ఈ అత్యవసర పరిస్థితిని చర్చించడానికి ఉదయాన్నే సుబ్బారాయుడుగారు గోవిందం ఇంటికి వచ్చారు. ఒక గంటసేపు తలుపులు మూసిన గదిలో మంతనాలు జరిగిన అనంతరం నారాయణకి కబురు పంపారు. నారాయణ వచ్చిన తరువాత మరొక గంట మంతనాలు నడిచాయి.

శ్రావణ శుద్ధ దశమీ శుక్రవారం నాడు గోవిందం, నారాయణ రెండవ కొడుకు వియ్యన్నని దత్తత చేసుకున్నాడు.

గాంధీయ సోషలిస్టు సమితిలో ఐక్యమత్యం ఏర్పడింది.

సమిష్టి వ్యవసాయ కేంద్రం తాలూకు పంటలో కొంతభాగం పోలీసు సహాయంతో కొందరు 'విప్లవకారుల' వద్ద పట్టుకున్నారు.

ఆ మధ్యాహ్నం జరిగిన విందుసందర్భంలో. ఊళ్ళో ప్రముఖులందరి సమక్షంలో. సుబ్బారాయుడుగారు మరపురాని ఒక చిన్న ఉపన్యాసం చేసారు.

ఈ దశ తగాంధీయ పోషలిస్టు సమితికి అఖండ విజయం. గాంధీ మహాత్ముడు. మానవులందరూ సోదరులే' అని ఒక ఉద్గ్రంథాన్ని రచించారు ఎన్ని సిద్ధాంత విభేదాలున్నా. మానసికమైన స్పర్ధలున్నా. మానవులందరూ అన్నదమ్ములే అని ఆయన ఉద్బోధ. ఈ నాడు తమ విభేదలు విస్మరించి గాంధీజీ ఉద్బోధను నిజమని రుజువు చేసారు. ఎటువంటి క్లిష్టపరిసితులు ఏర్పడ్డా ఎన్ని కష్టలెదురైయినా ఈసారి పురప్రముఖులమైన మనం ఆ మహా సూత్రాన్ని ఎన్నటికీ మరిచి పోకూడదు. మరోసారి ఆ పవిత్ర వాక్యన్ని ఈ సందర్భంలో - మననం చేద్దాం "మానవులందరూ సోదరులే."

సందులో సగం నిద్రలో నెమరు వేస్తున్న గేదెలు ఈఉద్బోధ విన్నాయి అందులో ఒక కొంటె గేదె "అంబా" అంది ఆ వాక్యం విని.

(విజయభాను - సంక్రతి 1970)